క్లుప్తంగా

సమాజ సేవకు పాటుపడాలి

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ సమాజ సేవకు పాటుపడాలని ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కె.సాల్మన్‌పాల్ చెప్పారు. షైన్ కోచింగ్ సెంటర్లో టెట్, డీఈడీ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇచ్చేలా శిక్షణ నిర్వాహకుడికి ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. సాల్మన్‌పాల్ మాట్లాడుతూ ఉచిత శిక్షణను విద్యార్థులు వినియోగించుకొని ఉత్తమ ఫలితాలు పొందాలని చెప్పారు. అనంతరం దాతలు ఎస్.శౌరి రూ.35వేలు, కె. సాల్మన్‌పాల్ రూ.16వేల సాయం అందజేశారు. జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన కె.విల్సన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో షైన్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ టి.ప్రసాద్, జీవీఆర్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ , టి.వీరయ్య, పి.రాజు, కె. రామారావు, డి.మెల్కియా, జ్ఞానయ్య, బాబురావు పాల్గొన్నారు.

రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలి



తాడికొండ: ఆపదలో ఉన్న రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వరదలు, భారీ వర్షాల వల్ల తాడికొండ, తుళ్ళూరు మండలాల్లో కొండవీటి వాగు ముంపు ఉధృతికి వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి పంటతోపాటు మినుము, జ్యూట్ ఇతర కూరగాయ పంటలు పూర్తిగా నీళ్లలో ఉన్నాయని వివరించారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై అభిప్రాయాలు త్వరగా తెలపాలి

తాడేపల్లిరూరల్: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై సలహాలు, సూచనలను త్వరగా తెలపాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని చెప్పారు. ఆదివారం దుగ్గిరాల ముర్తుజా నగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాయింట్ పార్లమెంట్ కమిటీకి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సెప్టెంబర్ 13 వరకే గడువు ఉందని వివరించారు. ప్రజలు త్వరగా అభిప్రాయాలు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో మైనార్టీ నేతలు షేక్ జానీ సాహెబ్, షేక్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని లారీ బోల్తా



ఫిరంగిపురం: ప్రమాద వశాత్తు లారీ డివైడర్‌ను ఢీకొని బోల్తా కొట్టిన ఘటన ఫిరంగిపురంలో ఆదివారం తెల్లవారు జామున జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని షిర్డి నుంచి ఉల్లిపాయల లోడుతో గుంటూరు వస్తున్న లారీ ప్రమాద వశాత్తు ఫిరంగిపురంలోని పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న డివైడర్‌ను ఢీకొంది. దీంతో లారీ బోల్తా కొట్టింది. ఘటనలో లారీలో ఉన్న డ్రైవర్ సుభానీ, క్లీనర్‌లకు స్వల్పగాయాలయ్యాయి. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులు వాహనాలను దారి మళ్లించారు.

జూదరుల అరెస్టు

తెనాలి రూరల్: పేకాట శిబిరంపై పోలీసులు ఆకస్మిక దాడులు చేసి జూదరులను అరెస్ట్ చేశారు. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ పోలీసులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 25,200 స్వాధీనం చేసుకున్నారు.

పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డులు ప్రదానం

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గోరంట్లలోని కెనడీ నెక్స్ట్ జెన్ ఇంటర్‌నేషనల్ స్కూలులో ఆదివారం 'పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డ్స్–2024' ప్రదానోత్సవం నిర్వహించారు. హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా ముఖ్య అతిథిగా పాల్గొని టీచర్స్‌కు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు రామనాథం అనిల్ కుమార్, హైకోర్టు లాయర్ డాక్టర్ కన్న రజిని, బి.పార్వతి నాయుడు, కన్న స్కూల్ అధినేత కన్న మాస్టర్, డైరెక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యర్థాలను తక్షణం తొలగించండి

తెనాలి అర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించారు. రోడ్లపై భారీగా వినాయక చవితి పత్రి పడి ఉండటాన్ని గమనించిన ఆయన వెంటనే వాటిని తొలగించాలని సూచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పారిశుధ్య చర్యలు తీసుకోవాలని సిబ్బందికి చెప్పారు.

గణపతీ నమో..



పాత మంగళగిరి సీతారామకోవెల ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహం



మంగళగిరి మెయిన్ బజార్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



ఫిరంగిపురంలో పూజలు చేస్తున్న దృశ్యం

- ఊరూవాడా ఉత్సవం
- వైభవంగా గణేశ్ చతుర్థి
- మండపాల్లో కొలువుదీరిన విఘ్నేశుడు

మంగళగిరి/తాడేపల్లి రూరల్/తాడికొండ/ఫిరంగిపురం : వినాయక చవితి సందర్భంగా గణపతి నవరాత్రులు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఊరూవాడా చలువ పందిళ్లు వెలిశాయి. వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి ప్రజలు భక్తిగా కొలుస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో మట్టి ప్రతిమలను ప్రతినిధులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి చేతుల మీదుగానూ మట్టి ప్రతిమల పంపిణీ జరిగింది.

- తాడికొండ మండలంలో చవితి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సీఐలు కె వాసు, గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.
- రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో బైపాస్ రోడ్, హిందుస్థాన్ పెట్రోలియం బంక్, పలు అపార్ట్‌మెంట్‌ల వద్ద క్లబ్ అధ్యక్షులు రావూరి రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఉచితంగా 1,200 మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సుకుమార్ రెడ్డి, కోశాధికారి రవీంద్రారెడ్డి, అప్పిరెడ్డి, శ్రీలత, కిరణ్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, జంగాల వెంకటేష్, శెట్టి రామకృష్ణ, కాట్రగడ్డ శివన్నారాయణ, కె. నగేష్, గోపు రాజేష్, పి. శ్రీనివాస్, ఎస్. కిరణ్, శెట్టి కేశవరావు, జొన్న రాజేష్ తదితరులు పాల్గొన్నారు.
- లింగంశెట్టి అసోసియేట్స్ కన్సల్టెన్సీ అధినేత లింగంశెట్టి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఉండవల్లి శుభోదయం సూపర్ మార్కెట్ వద్ద 1,000 మట్టి వినాయక ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్, లింగంశెట్టి కిషోర్, శెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- కాటూరి సామ్రాజ్యం కుమారుడు కాటూరి రవికుమార్, గుంటి లవీన్ ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణ పరిధిలోని హుస్సేన్ కట్ట వద్ద మంగళగిరి మాజీ మున్సిపల్ చైర్మన్, మాజీ ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి శనివారం మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు.



తుళ్ళూరు అయ్యన్న చెరువులో కొలువుదీరిన గణేశుడు



రావెలలో పూజలందుకుంటున్న గణపతి



పాత మంగళగిరి సీపీఐ స్థూపం దగ్గర..



మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి



తాడికొండ రెడ్ల బజారు రేడియో రూమ్ వద్ద పూజలందుకుంటున్న గణనాథుడు



వేమవరంలో పూజల్లో పాల్గొన్న చిన్నారులు



తాడేపల్లిలో మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తున్న లింగంశెట్టి కిషోర్ కుమార్, జంగాల వెంకటేష్



రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో మట్టి ప్రతిమల పంపిణీ



తాడేపల్లిలో మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు రావూరి రమేష్‌బాబు

వరద బాధితులకు ఆపన్నహస్తం



నులకపేట యూత్ ఆధ్వర్యంలో సిద్ధం చేస్తున్న ఆహార ప్యాకెట్లు



మహానాడు వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న విజయవాడ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి తదితరులు

తాడేపల్లిరూరల్ /మంగళగిరి: వరద బాధితులకు స్వచ్ఛంద సంస్థలు బాసటగా నిలుస్తున్నాయి. దాతలు ఆపన్నహస్తం అందిస్తున్నారు. మహానాడు వరద ముంపు బాధితులకు తాడేపల్లి పట్టణ పరిధిలోని సీఎస్ఆర్ కల్యాణ మండపం రోడ్‌లోని శ్రేయా ఎన్‌క్లేవ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విజయవాడ 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు, కృష్ణా జిల్లాల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వరద ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కనీసం ముందస్తు సమాచారం లేకపోవడం వల్ల ఇళ్లలోనుంచి కట్టుబట్టలతో బయటకు వచ్చారని, ఈ రోజు మహానాడు ప్రాంతంలో వరదలు తగ్గినా వారికి కనీస అవసరాలైన దుస్తులు కూడా లేవని, తాడేపల్లికి చెందిన శ్రేయా ఎన్‌క్లేవ్ అసోసియేషన్ ఆ ప్రాంతంలో నివసిస్తున్న 200 మందికి దుప్పట్లు పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రేయా ఎన్‌క్లేవ్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

- నులకపేటకు చెందిన యువకులు రెండువేల మంది వరద బాధితుల కోసం ఆహార పదార్థాలు సిద్ధం చేసి పంపిణీకి ట్రాక్టర్‌లో విజయవాడ తరలించారు.
- మంగళగిరి పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో 300 మంది వరద బాధితులకు దుప్పట్లు, చీరలు, కండువాలు, లుంగీలు, షర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మునగపాటి వెంకటేశ్వరరావు, జగ్గారపు శ్రీనివాసరావు, జింకా వెంకట రమణ, చిలుకోటి అంజిబాబు, పోలా మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ విద్యార్థి సంఘ కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

తెనాలి అర్బన్: సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ పట్టణ విద్యార్థి విభాగ అధ్యక్షునిగా షేక్ మొహిద్దీన్, ఉపాధ్యక్షునిగా బాలాజీ వరప్రసాద్, కార్యదర్శిగా సయ్యద్ ఇర్ఫాన్, ట్రెజరీగా అనస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెనాలిలోని జామీయ మసీదు ఆవరణలో ఆదివారం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో సయ్యద్ ఇమ్రాన్, పి.ప్రశాంత్, కోలా సాయి, ఎ.మహేష్, షేక్ సుభాని పాల్గొన్నారు.

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

పట్నంబజారు: యువతిని వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై కేసు నమోదు అయింది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. శ్యామలనగర్ లో నివాసం ఉండే యువతికి బీటెక్ చదువుతున్న సమయంలో నగరంపాలేనికి చెందిన నిమ్మకాయల శ్రీనివాస్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ప్రస్తుతం చదువు పూర్తి చేసుకుని హైదరాబాదులో ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలో శ్రీనివాస్ కుమార్ నిత్యం ఆమెని వెంట పడుతూ వేధింపులు గురి చేయడంతో పాటు, పెళ్లి చేసుకోవాలంటూ ఇబ్బందులు గురి చేశాడు. ఇటీవల కాలంలో ఆమె చేయిపట్టుకుని అమర్యాదగా ప్రవర్తించడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ



ఈపూరులంకలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

తెనాలి అర్బన్: రోటరీ ఆపద్బంధు ప్రాజెక్టులో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం డిస్ట్రిక్ గవర్నర్ శరత్ చౌదరి ఆదేశాల మేరకు రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లయన్ సిటీ వారి ఆధ్వర్యంలో తెనాలి క్లబ్ సహకారంతో వరద బాధితులకు ఆదివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. భట్టిప్రోలు, కొల్లూరు మండలాల పరిధిలోని తోకలవారిపాలెం, తూరకపాలెం, ఈపూరులంక, తడికల గుడి, చింతమొట్టు, కనిగిరిలంక, గుంటూరు గూడెం తదితర గ్రామాల్లోని వారికి సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు ఎస్.రాంప్రసాద్, తాళ్ల రాజశేఖర్‌రెడ్డి, హరిహర ప్రసాద్ మాట్లాడుతూ లంక గ్రామాల్లోని 2500 కుటుంబాలకు రూ.25లక్షల విలువ చేసే నిత్యావసర వస్తువులను పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి, ఐఏఎస్ అధికారులు ప్రఖర్ జైన్, సంజన సింహా, పిడుగురాళ్ల క్లబ్ కార్యదర్శి నీరుమళ్ల రాజేష్, తెనాలి క్లబ్ ప్రతినిధులు ఈదర వెంకట పూర్ణచంద్, గుప్తా వెంకటరత్నం, కన్నెగంటి మురళి, జి.వి.నారాయణ, ఈదర శ్రీనివాసరావు, పలువురు అధికారులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల స్వాధీనం

కొల్లిపర: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. ఆయన శనివారం రాత్రి సిబ్బందితో కలసి మండలంలోని గ్రామాల్లో గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మున్నంగిలో ఇళ్ల మధ్య నిల్వ ఉన్న ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ తెలిపారు.

గరికపాటి వర్ధంతి



గరికపాటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రజానాట్య మండలి నాయకులు

తాడేపల్లిరూరల్: డాక్టర్ గరికపాటి రాజారావు వర్ధంతిని ఆదివారం మంగళగిరి పట్టణ పరిధిలోని వేములపల్లి శ్రీకృష్ణభవన్ సీపీఐ కార్యాలయంలో ప్రజానాట్య మండలి నాయకులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోలి సీతారామయ్య గరికపాటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ గరికపాటి గొప్ప సినీ దర్శకుడని, కళాకారుడని కీర్తించారు. మాజీ ఎంపీడీవో ఆదినారాయణ మాట్లాడుతూ డాక్టర్ గరికపాటి రాజారావు వృత్తి రీత్యా వైద్యుడని, ఆయన ఉచిత వైద్య సేవలు అందించడానికి విజయవాడలోని పోరంకిలో ప్రజావైద్యశాల నెలకొల్పి ఫీజు లేకుండా రోగులకు సేవ చేశారని కొనియాడారు. అనంతరం సందుపట్ల భూమతి గరికపాటి రాజారావు మీద పలు గేయాలను ఆలపించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ఎస్సీ, ఎస్టీ రైట్ యాక్ట్ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, న్యాయవాది సురేష్, గంజి వెంకయ్య, కాకర్ల నరసింహారావు, బూసి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

వైవిధ్యమైన సినీ నటి భానుమతి ఒక జీవిత పాఠం

శత జయంతి సభలో పాత్రికేయుడు సినీ పరిశోధకుడు రెంటాల జయదేవ



రెంటాల జయదేవకు సత్కారం

తెనాలి: భారతీయ సినిమాలో అందం, ఆకర్షణ, అభినయం, గాత్రం, సంగీత దర్శకత్వం, దర్శకురాలు, స్టూడియో అధినేత్రి...ఇంతటి వైవిధ్యమున్న సినీనటి భానుమతి మినహా మరొకరు లేరు...ఆమెను ఒక జీవిత పాఠంగా నేటితరం తెలుసుకోవాలని ప్రముఖ పాత్రికేయుడు సినీ పరిశోధకుడు రెంటాల జయదేవ అభిప్రాయపడ్డారు. తెనాలి రామకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో జరిగిన ప్రముఖ సినీనటి భానుమతీ రామకృష్ణ శత జయంతి సభకు చైతన్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షత వహించారు. జయదేవ మాట్లాడుతూ ఆరు దశాబ్దాల్లో నటిగా, తల్లి, వదినగా, వృద్ధురాలి పాత్రలతో ఆయా కాలాల్లో ప్రభావాన్ని చూపిన గొప్ప నటి భానుమతి చెప్పారు. ఎంజీఆర్, ఎన్టీఆర్, ఏఎన్నార్ వంటి గొప్ప నటులు భానుమతిని గౌరవంగా సంబోధించేవారని తెలిపారు. స్వర్గసీమ సినిమాలో భానుమతి నటనను చూసి తాను నేర్చుకున్నానని శివాజీగణేశన్ చెప్పడం ఆమె ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. దక్షిణాదిలో పద్మశ్రీ తీసుకున్న తొలి నటిగా, రచయిత్రిగా 'అత్తగారి కథలు'కు ఏపీ సాహిత్య అకాడమీ అవార్డును, తన జీవిత చరిత్ర 'నాలో నేను'ను జాతీయ అవార్డును స్వీకరించిన మహానటిగా భానుమతి చరిత్రలో నిలిచారని చెప్పారు. తెనాలితో భానుమతి తండ్రికి గల అనుబంధాన్ని గుర్తుచేశారు. విశ్రాంత తెలుగు ప్రొఫెసర్, రచయిత్రి ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి మాట్లాడుతూ బహుముఖీనమైన ప్రతిభ కలిగిన భానుమతి, తాను ప్రవేశించిన ప్రతి రంగంలోనూ సమాజంపై ప్రభావం చూపడం గొప్ప విషయమని తెలిపారు. ఉన్నతమైన వ్యక్తిత్వం, చమత్కారపూరితమైన సంభాషణలు ఆమె సొంతమన్నారు. 'అభినవ అష్టావధాని'గానూ ప్రశంసలను అందుకున్నట్టు చెప్పారు. సభాధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి మాట్లాడుతూ తెనాలి క్లాసికల్ ఫిలిం సొసైటీ వ్యవస్థాపకుడుగా భానుమతితో గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సభానంతరం భానుమతి పాటలతో కూడిన సినీ సంగీత విభావరిని నిర్వహించారు. ప్రముఖ గాయనీ గాయకులు వెంపటి సత్యనారాయణ (తెనాలి), బెల్లంకొండ భారతి (చిలకలూరిపేట) గానాలాపనతో ప్రేక్షకుల కరతాళ ధ్వనులను అందుకున్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



తెనాలి అర్బన్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంలోనూ స్థానిక శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి సభ్యుల సేవా కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం 60 ఏళ్ల గుర్తు తెలియని మృతదేహానికి సమితి సభ్యులు తెనాలిలో సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు నిర్వహించారు. సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను కథనం ప్రకారం.. కొల్లూరుకు చెందిన 65 ఏళ్ల వృద్ధుడు అనారోగ్యంతో తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అతనికి ఎవరు లేకపోవడంతో కొల్లూరు పోలీసులు శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృందసేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీనుకు ఫోన్ చేసి దహన సంస్కారాలు నిర్వహించాలని కోరారు. దీంతో ఆయన సభ్యులతో కలసి జిల్లా వైద్యశాలలోని మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలో తరలించారు. సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు నిర్వహించారు.